అయిపోయింది. పైగా, ఆస్తికీ, కట్నానికీ సంబంధం లేనట్టు కనపడుతుంది. ఆస్తివున్న వాళ్ళ పద్ధతే ఆస్తిలేని వాళ్ళ పద్ధతి అయిపోతుంది. ఆస్తి వుందా లేదా అని చూడరు. అందరికీ కట్నమే సాంప్రదాయం. కట్నం ఇచ్చి తీరాలి!"

"అప్పటి నా లాగా ఆడపిల్లలు బుద్ధి లేకుండా వుంటే, ఎన్ని సాంప్రదాయాలైనా పుట్టుకొస్తాయి."

"బుద్ధి వున్నా తేడా ఏమీ రాదమ్మా! ఆడ పిల్లలు కట్నాలివ్వడం మానుకుంటే అప్పుడు ఆస్తి లెక్కలు ప్రారంభమవుతాయి. ఆడ పిల్లల వేపు వాళ్ళు మొగ పిల్లల ఆస్తి లెక్కలు చూడడం లేదూ? ఆస్తుల్నిబట్టి సంబంధాలు నిర్ణయించుకోడం లేదూ? ఇదీ అలాగే. కట్నాల్ని తీసేస్తే, కట్నాల 'బేరాల'న్నీ ఆస్తి లెక్కలుగా మారిపోతాయి. ఆస్తివున్న ఆడపిల్లకే పెళ్ళి అవుతుంది. లేకపోతే లేదు. అందుకే, 'కట్నం సమస్య'లాగ కనపడే సమస్యంతా ఆస్తి సమస్యే!"

తల్లి తల పంకించింది.

"ఆస్తులు కూడబెట్టుకునే వాళ్ళ జీవితాల్లో ఏముంటుందమ్మా, ఆస్తి లెక్కలు గాక? పది పైసల బిళ్ళలు కాకపోతే పది రూపాయల నోట్లో, వంద రూపాయల నోట్లో లెక్క పెడతారు. ఇరవై నాలుగు సంవత్సరాలు కాకపోతే, ఇరవై నాలుగు గంటలూ లెక్క పెడతారు. అంతేకదా తేడా? ఏ మనిషి ఆస్తి లెక్కలు ఆ మనిషికి వుండాలంటే, డబ్బు పిచ్చి తప్పుతుందా? నేనైతే, కట్నం తీసుకునే మనిషినే కాదు, ఆస్తి వున్న మనిషిని కూడా ప్రేమించలేను!"

కూతుర్ని చూస్తూ తల్లి చిరునవ్వు నవ్వింది.

[2-6-89 'ఆంధ్రజ్యోతి' వారపత్రికలో]★

# ఇంకో అమ్మ

"ఇక్కడ నించున్నావా ఇంతసేపూ? అమ్మ ధనియాలు తెమ్మని పంపుతే ఇదా నువ్వు చేస్తోన్న నిర్వాకం? ఆ పాములాళ్ళ వెనకే వెళ్ళకపోయావూ?"

"పాములాళ్ళెప్పుడో వెళ్ళిపోయారే .... కమలా వాళ్ళు ఆడుకుంటున్నారనీ ...."

"ఓహో! ఆ పాములాటలు కాకపోతే ఈ దొమ్మ రాటలూ! ఇంటికి పద నీకు మూడిందిలే. అమ్మ తెగ తిట్టిపోస్తోంది."

"నిజంగానా అక్కా? అమ్మ కోపంగా వుందేవిటే?"

"ఉండదూ? సరుకు తెమ్మని కొట్టుకు పంపుతే ఇంటికి తిరిగి రావాలన్న జ్ఞానమేమన్నా వుందా నీకూ?"

"ధనియా లెప్పుడో తెచ్చేశానే .... అక్కా! అమ్మకి నువ్విచ్చెయ్యవే!"

"నాకెందుకు తద్దినం, నువ్వే ఇచ్చుకో!"

"నన్ను కొడుతుందేమోనే .... అక్కా, కొంచెం ఇవ్వవే."

"కొడితే ఏడుస్తూ కూచో! ఏం, చెప్పిన పని చెయ్యకపోతే కొట్టక ముద్దెట్టుకుంటుందా?"

"తెచ్చేశాను కదే అక్కా."

"నేను రాకపోతే ఎప్పటికొచ్చే దానివి?"

"వొచ్చేస్తున్నానే, కమల ఏదో అడుగుతుంటేనూ నుంచున్నాను......."

"నాకేం తెలీదు. నువ్వెళ్ళి ఇచ్చుకో. ఏమడిగిం దేవిటి కమల?"

"ఆడుకుందాం వొస్తావా అంది."

"వారం రోజుల్లో పరీక్షలు పెట్టుకుని ఆటలాడతా వన్నమాట, ఆటలు!"

"అన్నీ వొచ్చేసునే నాకు, పజ్యాలూ, ఎక్కాలూ ..."

"అబ్బో! పెద్ద పండితు రాలివైపోయావు మరి. ఇక పుస్తకం ముట్టక్కర్లేదు."

"రాత్రుళ్ళు చదువుకుంటాగా? కమలా వాళ్ళు ఆడుకోడం లేదా? వాళ్ళకీ పరీక్షలేగామ్మా!"

"ఏమో, ఎలా ఏడుస్తారో! వాళ్ళెప్పుడన్నా పుస్తకం

ముట్టుకోడం చూశావా? వాళ్ళెప్పుడూ కాకుల్లాగ తిరుగుతారని అమ్మ అనదూ? ఎండలోనూ వాళ్ళే, వానలోనూ వాళ్ళే...ఛ, ఏం పిల్లలో! నడవ్వేం నువ్వూ?"

"వస్తున్నాగా? అక్కా, వాళ్ళంతా ఆనక సినిమా కెళ్తారటే!"

"బుద్ధి లేకపోతేసరీ, ఎన్ని సినిమాలు చూస్తారు నెలకీ? చూస్తే చూస్తారు. వాళ్ళకేం డబ్బొచ్చి పడు తోంది. అమ్మ అనదూ, వాళ్ళ నాన్న అన్నీ వెధవ పనులే చేసి గడిస్తాడనీ?"

"మన నాన్న కూడా వెధవ పనులు చెయ్య కూడదూ?"

"చాల్లే, నోరుముయ్యి! వెధవ పనులూ చెయ్య మంటావు, ఇంకే మన్నానూ చెయ్యమంటావు."

"ఏమ్మా, తప్పా? చక్కగా డబ్బొస్తుందిగా?"

"డబ్బేనా ఏవిటీ? మంచీ మర్యాదా వుండక్క ర్లేదూ? వెధవ పనులు చేస్తే అమ్మ వూరుకుం టుందా?"

"వెధవ పనులంటే ఎవిటే అక్కా?"

"నీకేం తెలుస్తుంది? చిన్నపిల్లవి. ఊరుకో."

"పోనీలేమ్మా. నాకెందుగ్గానీ కమల గౌను యెంత బాగుందోనే అక్కా! చూశావా నువ్వూ?"

"ఆఁ, చూడకేం? దాని కుచ్చులూ, అదీనూ! వాళ్ళకి తగ్గ గౌన్లే అవి. రౌడీ గౌన్లు."

"అంతా బడాయి. కుచ్చులు పెట్టుకుంటే యేమవుతుందేవిటీ?.... అక్కా, కమలా వాళ్ళతో మనం కూడా వెళ్దామే సినిమాకీ."

"అమ్మ వీపు బద్దలు కొడుతుంది."

"ఎందుకు కొడుతుందేవిటీ? అందరూ వెళ్తా రుగా? అమ్మ వెళ్ళదూ మనల్ని వొదిలేసీ?"

"వెళ్తే వెళ్తుంది. పెద్ద వాళ్ళతో మనకి సాపత్యమా? .... అలా వెనక్కి వెనక్కి చూస్తావేవిటే? అసలు ఇంటికి వస్తావా, రావా? అన్నట్టు మరిచేపోయాను. అమ్మ నీకూ, నాకూ గాజులుకొంది. నీకు ఎఱ్ఱవీ, నాకు ఆకు పచ్చవీ .... ఎంత బాగున్నాయో!"

"ఛీ! నాకేం అక్కర్లేదు వెధవ గాజులు. ఆ డబ్బుల్తో సినిమాకెళ్తే ...."

"సినిమా, సినిమా అని పట్టించావేమిటి పిచ్చి మొద్దూ! కడుపు నిండుతుందా, కాలు నిండుతుందా? ఆడపిల్లల చేతులు గాజుల్లేకపోతే ఏడిసినట్టుంటా యని అమ్మ విసుక్కోదూ?"

"చేతులెక్కడన్నా ఏడిసినట్టుంటాయా? నా చేతులు చూడు ఎంత బాగున్నాయో! నాకేం గాజులక్క ర్లేదు. మళ్ళీ అవి బద్దలైపోతే పోట్లాడుతుంది. కమలా వాళ్ళు గాజులెప్పుడూ వేసుకోరు."

"అస్తమానూ ఆ వెధవల పేర్లెత్తకు, నాకు వొళ్ళు మండుతుంది. వెధవ స్నేహాలు చేసి చెడుతున్నావు. సాయంత్రం లక్ష్మి పిన్ని గారింటికి పేరంటానికెళ్ళాలని అమ్మ గాజులు కొంటే .... వాళ్ళ పాపాయికి చెవులు కుట్టిస్తున్నారు తెలుసా?"

"అమ్మో, అంత చిన్న పాపాయి యాడవదూ?"

"ఏడిస్తే ఏడుస్తుంది. నోరు నెప్పేస్తే అదే వూరు కుంటుంది. ఇవ్వాళే మంచి రోజట. మళ్ళీ మంచి రోజు రావొద్దూ?"

"ఏమో! నేనేం పేరంటానికి రాను..నా డబ్బులు నా కిచ్చెయ్యండి! సినిమాకి పోతాను, కమలా వాళ్ళతో. నా గాజులు నువ్వు తీసేసుకో!"

"ఆఁ, నీ డబ్బులు! నీ తాత గడించాడు! అమ్మతో చెపుతానుండు. కాళ్ళు విరగ్గొడితే కుదురుతుంది నీ తెగులు."

"ఎందుకు విరగ్గొడుతుందేం? కాస్త పరుగులెత్తితే, 'కాళ్ళు విరగ్గొట్టుకుంటారఱ్రా' అని అరుస్తుందిగా, తనెందుకు విరగ్గొడుతుందేం?"

"ఏం చేస్తుంది, పెంకి వేషాలేస్తే?"

"అక్కా! అక్కా! కమల నాటకంలో వేషం వేస్తోం దటే. మేష్టారు వెయ్యమన్నారట."

"ఛీ, ఛీ! పాడు వేషాలు. ఏం చేసినా వాళ్ళకే తగును."

"ఏమ్మా తప్పా? సరదాగా నాటకంలో వేస్తే?"

"సరదా ఏమిటి? సిగ్గుండక్కర్లా? అందరి ముందూ ఎలా గంతులేస్తారు బాబూ!"

"గంతులెయ్యక్కర్లేదే. కృష్ణుడూ, రాధా పాట పాడుతూ నాటకం వేస్తారట, అంతే. నన్ను రాధ వేషం

వెయ్యమందే కమల."

"అదా సంగతీ? మరి చెప్పవేం? వాళ్ళతో బైల్దేరు. నిన్ను సినిమాల్లో కూడా చేరుస్తారు."

"అమ్మో, సినిమాల్లోనే! ఎంత బాగుంటుందోనే!"

"చాల్లే నోరుముయ్యి. పేట్రేగి పోతున్నావు."

"సీత పిన్ని అందరి ముందూ వీణ వాయిస్తే ఎంతో బాగుందని మెచ్చుకున్నారుగా? సినిమాల్లోకి పనికొస్తుందన్నారూ."

"అది వేరు. వీణ అంటే సరస్వత్తో సమానం. చక్కగా తివాసీ మీద కూచుని వీణ వాయిస్తుంది. సినిమాలోలా గంతు లేస్తుందనుకున్నావా? .... పదవే తల్లీ తొందరగా, అమ్మ ఏం కేకలేస్తోందో."

"ధనియాల్లేకపోతే ఏం మునిగిపోతుందేం? కూర వండేసుకోకూడదూ?"

"ఎవరు నేర్పుతున్నారు నీ కివన్నీ? దేనికేది పడాలో అది పడకపోతే హోటల్లో వంటల్లాగ ఏడు స్తాయని అమ్మ అనదూ?"

"అక్కా! హోటల్లో యెంత బాగుంటుందే! మనం మామయ్యగారి వూరు వెళ్ళేప్పుడు స్టేషను దగ్గర హోటల్లో తినలేదూ? ఎంత బాగున్నాయో ఇడ్లీలు."

"అయితే నువ్వు వంటా అదీ నేర్చుకోకు. హోట ల్లోనే మింగు."

"అబ్బా! అల్లాగైతే ఎంత బాగుంటుందో నాకు! ఎంత బాగా వండినా హోటల్లో తింటారెందుకండీ — అని అమ్మ పోట్లాడదూ నాన్నతో? నాన్నకీ, నాకూ అంతే. హోటేల్లోవే బాగుంటాయి."

"నాన్న తింటే తింటాడు. మొగాళ్ళకేవిటి? ఎల్లా చేసినా చెల్లుతుంది. వాళ్ళ డబ్బు వాళ్ళ ఇష్టం. నాన్న లాగ నువ్వూ చేస్తావా?"

"అక్కా! మొగాళ్ళకి డబ్బు లెవరిస్తారే?"

"ఒకరిచ్చేదేవిటి? వాళ్ళే ఉద్యోగాలు చేస్తారు."

"ఊఁ, చేస్తే?"

"చేస్తే ఏవిటి, నీ తలకాయ. అందుకే వాళ్ళ దగ్గర డబ్బుంటుంది. ఎక్కడేది తినాలన్నా తింటారు."

"అయితే, నేనూ ఉద్యోగం చేస్తాను."

"ఏడిశావులే. అమ్మ వొప్పుకుంటుందను కున్నావా? నేనూ నీలాగే అనుకున్నాలే చిన్నప్పుడు."

".... .... .... .... ...."

"నిలబడ్డావేమిటి? రావేం లోపలికీ?"

"అమ్మ కొడుతుందేమోనే అక్కా, నువ్వు తీసుకు పోవే ఇవీ—నా కాలికి దెబ్బ తగిలిందని చెప్పెయ్యవే."

"దెబ్బ తగిలిందేం నీ కాలికీ? ఎక్కడ నేర్చావు ఈ వేషాలన్నీ? అమ్మదాకా ఎందుకు, నేను లేనూ? నీ రెండూ నీకు పడితేగానీ ...."

అక్క చెల్లెలి జడ గట్టిగా పట్టుకుని తలకాయ వంచి వీపుమీద దబదబా చరవడం మొదలుపెట్టింది.

చెల్లెలు అక్కచేతిలో పెనుగులాడుతూ నేలమీద దొర్లుతోంది.

అక్క కొడుతూనే వుంది.

చెల్లెలు ఏడుస్తూనే వుంది.

దెబ్బలు తినే చెల్లెలికి — ఏడేళ్ళు!

దెబ్బలు కొట్టే అక్కకి — పన్నెండేళ్ళు!

[25-1-1980 "ఆంధ్రజ్యోతి" వారపత్రికనించి] ★

## ఈ కథ గురించి:

ఇది రాసినప్పుడు, దీనికి 'అమ్మ' అని పేరు పెట్టాను. కానీ, అప్పటికే 'అమ్మ' పేరుతో రాసిన కథ ఒకటి వుంది. అదే పేరుతో ఒక కథ వుండగా, ఇంకో కథకి కూడా అదే పేరు ఎందుకు పెట్టానో ఇప్పుడు ఆశ్చర్యంగా వుంది. ఈ కథల్ని చూసుకుని ఎన్నిటికో ఆశ్చర్యాలూ నిర్ఘాంతాలూ పడడం జరుగుతూనే వుంది. ఇప్పుడు చెయ్యగలిగేది ఈ కథ పేరు మార్చడమే. అదే చేశాను. ఇది 'ఇంకో అమ్మ' అయింది!

చలంగారి సంభాషణల శైలిని అనుకరించాలనే సరదాతో రాసిన కథ ఇది.

4-7-2004